సాక్షి కర్నూలు

మంగళవారం । 26 । డిసెంబర్ । 2023



కేసీకి నీటి విడుదల

గూడూరు: సుంకేసుల రిజర్వాయర్ నుంచి కేసీ కాల్వకు 159 క్యూసెక్కుల నీటి విడుదల చేసినట్లు సోమవారం అధికారులు తెలిపారు. డ్యాంలో 1.068 టీఎంసీల నీరు ఉంది.



రాజగోపురానికి రూ.లక్ష విరాళం

కౌతాళం: ఉరుకుంద ఈరన్న స్వామి ఆలయ రాజగోపుర నిర్మాణానికి పత్తికొండకు చెందిన ఇల్లూరి నాగరాజ కుటుంబ సభ్యులు రూ.1,01,116 విరాళమిచ్చారు.



శాస్త్రోక్తంగా సహస్రదీపార్చన సేవ

శ్రీశైలంటెంపుల్: భ్రమరాంబా మల్లికార్జున స్వామి వార్లకు సోమవారం సహస్రదీపార్చన సేవ నిర్వహించారు. అనంతరం ఉత్సవమూర్తులను వెండిరథంపై ఆలయ ప్రదక్షిణ నిర్వహించారు.

న్యూస్‌రీల్

చురుగ్గా కేబీ రోడ్డు పనులు



కర్నూలు(అర్బన్): కర్నూలు – బళ్లారి రోడ్డు (కేబీ రోడ్)లో కి.మీ 4/0 నుంచి 8/4 కి.మీ వరకు రోడ్డు వెడల్పు పనులు చురుగ్గా జరుగుతున్నాయి. తుంగభద్ర పుష్కరాల నిధులు రూ.13.20 కోట్లతో ఈ పనులను చేపడుతున్నారు. కర్నూలు నగరం బళ్లారి చౌరస్తా నుంచి కల్లూరు మండలం పెద్దపాడు వరకు రోజు రోజుకు ట్రాఫిక్ పెరిగిపోతుండటంతో ప్రస్తుతం ఉన్న రోడ్డును వెడల్పు చేసి, మరింత బలోపేతం చేసేందుకు చర్యలు చేపట్టినట్లు ఆర్అండ్‌బీ ఎస్ఈ ఆర్ నాగరాజు తెలిపారు. పనులు కాగా రోడ్డు వెంట ఉన్న కల్వర్టులను పూర్తి స్థాయి నాణ్యతతో వెడల్పు చేస్తుండటంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.


వ్యాయామ ఉపాధ్యాయుడి సస్పెన్షన్

కోసిగి: మండల పరిధిలోని వందగల్లు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయుడు చెన్నయ్యను సస్పెండ్ చేస్తూ జిల్లా విద్యాధికారి రంగారెడ్డి ఆదేశాలు జారీ చేసినట్లు ఎంఈఓ నాగేశప్ప తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ పాఠశాల 10వ తరగతి విద్యార్థితో వ్యాయామ ఉపాధ్యాయుడు అసభ్యకరంగా వ్యవహరిస్తున్నాడనే ఆరోపణలు రావడంతో విచారించి సస్పెండ్ చేసినట్లు తెలిపారు.

డోర్ డెలివరీ పక్కాగా నిర్వహించాలి

కర్నూలు(రాజ్‌విహార్): డోర్ డెలివరీని పక్కాగా నిర్వహించాలని కర్నూలు–2డిపో మేనేజరు సర్దార్ హుసేన్ సూచించారు. సోమవారం ఆయన డిపోలో డోర్ డెలివరీ సిబ్బందికి పలు సూచనలిచ్చారు. కార్గో కొరియర్స్‌ను నిర్ణీత గడువులోపు అడ్రస్‌లకు వెళ్లి డెలివరీ చేయాలన్నారు. డెలివరీ సమయంలో ఫొటో తీసుకోవాలన్నారు.

పల్లెకు ‘ఉపాధి’



పనులకు హాజరైన కూలీలు

ఉపాధి నిధులతో ముమ్మరంగా అభివృద్ధి పనులు

- 9 నెలల్లోపు రూ.310 కోట్లు నిధులు వ్యయం
- ఇప్పటికే ఉపాధి కూలీలకు 81.52 లక్షల పని దినాలు
- జిల్లాకు అదనంగా మరో 10లక్షల పని దినాలు కేటాయించే అవకాశం
- నాలుగు మండలాల్లో కోటి లీటర్ల సామర్థ్యంతో 9 కొత్త చెరువులు
- అమృత్ సరోవర్‌లుగా 71 చెరువుల అభివృద్ధి
- 4,726 ఎకరాల్లో 100 శాతం సబ్సిడీతో పండ్లతోటలు
- 108.75 కిలోమీటర్ల మేర అవెన్యూ ప్లాంటేషన్

కర్నూలు(అగ్రికల్చర్): ఉపాధి హామీ పథకం నిధులతో గ్రామీణ ప్రాంతాలు కొత్త శోభను సంతరించుకుంటున్నాయి. ఈ పథకం వ్యవసాయ కూలీలు.. సన్న, చిన్న, మధ్యకారు రైతులను ఆదుకుంటూనే గ్రామీణాభివృద్ధికి దోహదపడుతోంది. జిల్లాలో గతంలో ఎప్పుడూ లేని విధంగా ఉపాధి నిధులతో అనేక అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయి. 2023–24 సంవత్సరంలో ప్రత్యేక పరిస్థితులు నెలకొన్నాయి. వర్షాభావం వల్ల వ్యవసాయం కలసిరాకపోవడంతో రైతులను ఉపాధి పనులు ఆదుకుంటున్నాయి. రైతులకు శాశ్వత ఆస్తులను కల్పించేందుకు పండ్లతోటల అభివృద్ధికి పెద్దపీట వేస్తుండటం విశేషం. ఈ ఏడాది డిసెంబర్ 18 నాటికే లేబర్, మెటీరియల్ కాంపోనెంటు కింద రూ.310 కోట్లు ఖర్చు చేయగా.. ఇందులో ఉపాధి కూలీలకే రూ.217 కోట్లు చెల్లించారు. ఈ ఆర్థిక సంవత్సరంలో జిల్లాకు 92 లక్షల పని దినాలు మంజూరయ్యాయి. అయితే 9 నెలల్లోపే కూలీలకు 81.52 లక్షల పనిదినాలను కల్పించారు. ఈ నేపథ్యంలో ఉపాధి పనులకు డిమాండ్ ఉన్న కర్నూలు జిల్లాకు అదనంగా 10 లక్షల పని దినాలు కేటాయించే అవకాశం ఉంది. జిల్లాలో 1.88 లక్షల కుటుంబాలకు ఉపాధి పనులు కల్పిస్తుండగా.. ఇప్పటి వరకు 4,504 కుటుంబాలకు 100 రోజుల పని దినాలు పూర్తయ్యాయి. కరువు ప్రాంతాలుగా ప్రకటించిన మండలాల్లో అదనంగా మరో 50 పని దినాలను వినియోగించుకునే అవకాశం ఏర్పడింది.

రోజుకు 63 వేల మందికి ఉపాధి

గత ఏడాది ఇదే సమయంలో ఉపాధి పనులకు కేవలం 10వేల వరకు మాత్రమే కూలీల హాజరు ఉంది. రోజుకు 65 లక్షల మందికి పనులు కల్పించాలనేది లక్ష్యం కాగా.. నేడు దాదాపు 63వేల మంది వరకు ఉపాధి పనులకు హాజరవుతున్నారు. ఈ నేపథ్యంలో జిల్లా నుంచి వలసలు గణనీయంగా తగ్గిపోయాయి. ఉపాధి నిధులతో కూలీలకు పనులు కల్పించడంతో గ్రామ సచివాలయాలు, రైతుభరోసా కేంద్రాలు, వైఎస్ఆర్ హెల్త్ క్లీనిక్‌లు, వైఎస్ఆర్ డిజిటల్, బల్క్‌మిల్క్ కూలింగ్ కేంద్రాల పనులపై ప్రధానంగా దృష్టి సారించారు. అదేవిధంగా పండ్లతోటల అభివృద్ధి, అవెన్యూ ప్లాంటేషన్, కమ్యూనిటీ సోక్‌ఫిట్స్, రెయిన్ వాటర్ హార్వెస్టింగ్ స్ట్రక్చర్, సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ కింద సంపదస్పష్టి కేంద్రాల నిర్మాణం పెద్ద ఎత్తున సాగుతున్నాయి.

గ్రామీణాభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యత

ప్రతి గ్రామ పంచాయతీలో సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంటు కింద సంపద సృష్టి కేంద్రాలు ఉండాలనేది లక్ష్యం. జిల్లాలో 481 గ్రామ పంచాయతీలు ఉండగా.. 2022–23 నాటికే 336 గ్రామాల్లో సంపద సృష్టి కేంద్రాలను నిర్మించారు. ఈ ఏడాది 145 గ్రామ పంచాయతీల్లో నిర్మించేలా చర్యలు తీసుకున్నారు. ఇందులో 90 వరకు పూర్తి చేశారు. జనవరి చివరిలోపు మిగిలిన వాటిని పూర్తి చేయాలనే లక్ష్యంతో జిల్లా యంత్రాంగం ఉన్నట్లు స్పష్టమవుతోంది. ప్రతి మండలంలో 10 ప్రకారం రూఫ్ వాటర్ రీచార్జి స్ట్రక్చర్లు నిర్మించి భూగర్భ జలాలు అభివృద్ధి చేయాలనేది లక్ష్యం. ఇందులో 170 వరకు మంజూరు చేయగా.. 90 గ్రౌండింగ్ అయ్యాయి. మరో వైపు గ్రామాల్లో కమ్యూనిటీ సోక్ పిట్స్ కూడా పెద్ద ఎత్తున ఏర్పాటు చేస్తున్నారు. గ్రామాల్లో పారిశుద్ధ్య లోపాన్ని అరికట్టడం లక్ష్యంగా వీటిని నిర్మిస్తుండటం విశేషం.



ఉపాధి నిధులతో నిర్మించిన కొత్త చెరువులు

తొమ్మిది కొత్త చెరువుల నిర్మాణం

భూగర్భ జలాల అభివృద్ధి లక్ష్యంగా ఉపాధి నిధులతో 80 చెరువులను అభివృద్ధి చేయడం విశేషం. అమృత్ సరోవర్ పేరిట చెరువుల రూపు రేఖలు మారిపోయాయి. వాటర్‌షెడ్ నిధులు రూ.58.81 లక్షలతో జిల్లాలో 9(హాలహర్వి మండలంలో 3, కృష్ణగిరి, ఓర్వకల్లు, ఎమ్మిగనూరు మండలాల్లో రెండేసి చొప్పున) చెరువులను కొత్తగా నిర్మించగా.. మరో చెరువును ఆధునీకరించారు. 10 వేల క్యూబిక్ మీటర్ల సామర్థ్యంతో.. అంటే కోటి లీటర్ల సామర్థ్యంతో కొత్త చెరువులను నిర్మించడంతో గ్రామాల్లో ఆనందం వ్యక్తమవుతోంది. మరో 70 చెరువులను పునరుద్ధరించడం విశేషం.

రికార్డుస్థాయిలో పండ్ల తోటల అభివృద్ధి



2023–24లో జిల్లాకు 92 లక్షల పని దినాలు కేటాయించగా.. ఇప్పటి వరకు 81.52 లక్షల పని దినాలు కల్పించాం. లేబర్ కంపోనెంటు కింద రూ.217 కోట్లు, మెటీరియల్ కాంపోనెంటు కింద రూ.93 కోట్లు ఖర్చు చేశాం. జిల్లాకు అదనంగా 10 లక్షల వరకు పని దినాలు కేటాయించే అవకాశం ఉంది. ఈ ఏడాది రికార్డు స్థాయిలో 4,726 ఎకరాల్లో పండ్లతోటలు, 108.75 కిలోమీటర్ల పొడవున అవెన్యూ ప్లాంటేషన్ పూర్తి చేశాం.

– అమరనాథరెడ్డి, ప్రాజెక్టు డైరెక్టర్, డ్వామా

పండ్లతోటలతో శాశ్వత అభివృద్ధి

ఉపాధి నిధులతో 100 శాతం సబ్సిడీతో పండ్లతోటలు అభివృద్ధి చేస్తున్నారు. 2023–24లో రికార్డు స్థాయిలో 4,726 ఎకరాల్లో పండ్లతోటలు అభివృద్ధి చేసుకున్నారు. డ్రా గన్ ఫ్రూట్స్, దానిమ్మ, మామిడి, జామ, సపోట, చీని తదితర పండ్లతోటలతో పాటు పూలతోటల అభివృద్ధికి కూడా అవకాశం ఏర్పడింది. రైతులు సాంప్రదాయపు పంటలకు స్వస్తి పలికి క్రమంగా పండ్లతోటల వైపు దృష్టి సారిస్తున్నారు. అదేవిధంగా ఈ ఏడాది 100 కిలోమీటర్ల పొడవున మొక్కలు నాటి పెంచాలనేది లక్ష్యం కాగా.. ఈసారి 108.75 ఎకరాల్లో అవెన్యూ ప్లాంటేషన్ పూర్తయింది.

నేటి నుంచి ఆడుదాం–ఆంధ్రా క్రీడలు

- ఐదు క్రీడాంశాల్లో పోటీలు
- ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు

కర్నూలు(సెంట్రల్): యువతీ, యువకుల్లో క్రీడానైపుణ్యాన్ని గుర్తించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సంకల్పించింది. గ్రామ/వార్డు సచివాలయ స్థాయి నుంచి రాష్ట్రస్థాయి వరకు పోటీలను నిర్వహించి విజేతలను ప్రోత్సహించేందుకు ఆడుదాం–ఆంధ్ర క్రీడలకు శ్రీకారం చుట్టింది. అందులో భాగంగా జిల్లాలోని 672 సచివాలయాల పరిధిలో మంగళవారం ఆడుదాం–ఆంధ్రా క్రీడలు ప్రారంభం కానున్నాయి.

ఏర్పాట్లు పూర్తి..

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్న ఆడుదాం–ఆంధ్రా క్రీడలకు అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. జిల్లాలోని 672 గ్రామ/వార్డు సచివాలయాలకు క్రికెట్, ఖోఖో, బ్యాడ్మింటన్, వాలీబాల్, కబడ్డీ కిట్లను ప్రతి చేరవేశారు. క్రీడలను నిర్వహించేందుకు 476 క్రీడా మైదానాలను గుర్తించి మౌలిక సదుపాయాలు కల్పించారు. ప్రతి మైదానంలో తాగునీరు, బస చేసేందుకు సదుపాయం, భోజనాలు అందించేలా చర్యలు తీసుకుంటున్నారు. ఇందు కోసం 250 మంది పీడీలు/పీఈటీలను నియమించారు.

పాల్గొననున్న 1,49,282 మంది క్రీడాకారులు..

ఆడుదాం–ఆంధ్రా క్రీడల్లో పాల్గొనేందుకు యువతీ, యువకులు పెద్ద ఎత్తున ఆసక్తి చూపుతున్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా 672 సచివాలయాల పరిధిలో 1,49,282మంది క్రీడాకారులు పేర్లను నమోదు చేసుకున్నారు. ఇందులో పురుషులు 1,05,905 మంది, మహిళలు 43,337 మంది ఉన్నారు. కాగా, క్రీడారులను మొత్తం 17,496 టీంలుగా విభజించారు. ఇందులో పురుష టీంలు 11,325, మహిళల టీంలు 6,171 ఉన్నాయి.

షెడ్యూల్..

ఆడుదాం–ఆంధ్రా క్రీడలు ఈనెల 26 నుంచి ఫిబ్రవరి 10వ తేదీ వరకు జరుగుతాయి. 26 నుంచి జనవరి 9వ తేదీ వరకు గ్రామ/వార్డు సచివాయాల పరిధిలో జరుగుతాయి. మండల స్థాయిలో జనవరి 10 నుంచి 23వ తేదీ వరకు, నియోజకవర్గ స్థాయిలో 24 నుంచి 30వ తేదీ వరకు, జిల్లా స్థాయిలో 31 నుంచి ఫిబ్రవరి 5వ తేదీ వరకు, రాష్ట్ర స్థాయి క్రీడలను వైజాగ్‌లో నిర్వహిస్తారు. అక్కడ ఫిబ్రవరి 6 నుంచి ఫిబ్రవరి 10వ తేదీ వరకు జరుగుతాయి.



ఆడుదాం ఆంధ్రా క్రీడల మస్కట్

ఏ క్రీడల్లో ఎంతమంది క్రీడాకారులు పాల్గొంటారంటే...!

క్రీడా పేరు		క్రీడాకారుల సంఖ్య	టీంల సంఖ్య
క్రికెట్	పురుషులు	52,792	3683
	మహిళలు	9281	735
బ్యాడ్మింటన్	పురుషులు	5391	2664
	మహిళలు	4695	2312
వాలీబాల్	పురుషులు	12611	1542
	మహిళలు	6416	862
కబడ్డీ	పురుషులు	23424	288
	మహిళలు	8242	965
ఖో ఖో	పురుషులు	11703	1083
	మహిళలు	14758	1332



గార్గేయపురంలో క్రీడా మైదానాన్ని చదును చేస్తున్న దృశ్యం

నగదు ప్రోత్సాహకాలు, మెడల్స్, ప్రశంసా పత్రాలు


ఆడుదాం– ఆంధ్రా క్రీడా పోటీల్లో విజేతలకు ప్రభుత్వం నగదు ప్రోత్సాహకాలు, ట్రోఫీలు, మెడల్స్, ప్రశంసాపత్రాలు అందజేయనుంది. క్రికెట్, వాలీబాల్ కబడ్డీ, ఖో-ఖో క్రీడాంశాల్లో నియోజకవర్గ స్థాయిలో మొదటి బహుమతి రూ.35 వేలు, రెండవ బహుమతి రూ.15 వేలు, మూడవ బహుమతి రూ.5 వేలు, జిల్లా స్థాయిలో మొదటి బహుమతి రూ.60 వేలు, రెండవ బహుమతి రూ.30 వేలు, మూడవ బహుమతి రూ.10 వేలు, రాష్ట్ర స్థాయిలో మొదటి బహుమతి రూ.5 లక్షలు, రెండవ బహుమతి రూ.3 లక్షలు, మూడవ బహుమతి రూ.2 లక్షలు, బ్యాడ్మింటన్ క్రీడాంశంలో నియోజకవర్గ స్థాయిలో మొదటి బహుమతి రూ.20 వేలు, రెండవ బహుమతి రూ.10 వేలు, మూడవ బహుమతి రూ.5 వేలు, జిల్లా స్థాయిలో మొదటి బహుమతి రూ.35 వేలు, రెండవ బహుమతి రూ.20 వేలు, మూడవ బహుమతి రూ.10 వేలు, రాష్ట్ర స్థాయిలో మొదటి బహుమతి రూ.2 లక్షలు, రెండవ బహుమతి రూ.1 లక్ష, మూడవ బహుమతి రూ.50 వేలు అందజేయనున్నారు.

ఏర్పాట్లు పూర్తి చేశాం



ఆడుదాం–ఆంధ్రా క్రీడలను ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశాం. జిల్లాలో 1.50 లక్షల మంది క్రీడలు ఆడేందుకు రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. క్రీడాకారులకు ఇబ్బందులు లేకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నాం. జిల్లాలో ప్రతి సచివాలయం పరిధిలో క్రీడలు జరుగుతాయి. 476 మైదానాల్లో క్రీడలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశాం. క్రీడాకారులకు తాగునీరు, భోజనాలు, వసతి కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నాం.

– డాక్టర్ జి.సృజన, కలెక్టర్



సీఎస్ఐ చర్చిలో ప్రార్థనల్లో పాల్గొన్న క్రైస్తవులు

పరిశుద్ధుడు జన్మించగా.. లోకమంతా పరవశించగా!

ఆకాశంలో తార వెలుగొందగా.. దివి నుంచి భువికి బాల ఏసు ఏతెంచగా.. భూలోకాన సంబరాలు మిన్నంటగా.. దూతలు గేయాలు ఆలపించగా.. క్రైస్తవుల్లో సంతోషం వెల్లివిరిసింది. సోమవారం కర్నూలు జిల్లా వ్యాప్తంగా క్రిస్మస్ సంబరాలు ఘనంగా నిర్వహించారు. ఏసు రాకను స్వాగతిస్తూ ఉదయాన్నే ప్రార్థన మందిరాలకు చేరుకుని ప్రార్థనలు చేశారు. మానవాళి మధ్య శాంతి, కరుణ, సహోదర ప్రేమను నెలకొల్పేందుకే క్రీస్తు భూలోకానికి వచ్చారని, ఏసు జననం మానవాళికి రక్షణ కవచమని చర్చీల పాస్టర్లు, ఫాదర్లు ఏసు సందేశాన్ని వినిపించారు. క్రిస్మస్ సందర్భంగా కేక్ కటింగ్‌లు, ఆటల పోటీలతో క్రైస్తవులు సందడి చేశారు.



దైవసందేశం ఇస్తున్న రెవరెండ్ డాక్టర్ వరప్రసాద్

- మరిన్ని ఫొటోలు 8లో▶

ఓటరు జాబితా సవరణ దరఖాస్తులు పరిష్కరించాలి

- జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన

కర్నూలు(సెంట్రల్): ఓటరు జాబితా సవరణకు సంబంధించి పెండింగ్ దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలని కలెక్టర్ డాక్టర్ జి.సృజన ఈఆర్‌ఓలు, ఏఈఆర్‌ఓలను ఆదేశించారు. సోమవారం ఆమె టెలీ కాన్ఫరెన్స్ ద్వారా ఈఆర్‌ఓలు, ఏఈఆర్‌ఓలతో ఓటరు జాబితా సవరణపై సమీక్షించారు. పెండింగ్ దరఖాస్తులను సోమవారం రాత్రిలోపు పరిష్కరించాలని సూచించారు. ఫొటోగ్రాఫిక్, డెమోగ్రాఫిక్ సిమిలర్ ఎంట్రీస్‌ను కూడా పరిశీలించాలన్నారు. నోడల్ ఆఫీసర్లు డీఆర్వోతో సమన్వయం చేసుకొని విధులు నిర్వహించాలన్నారు. ఆర్‌డీఓ, పోలీసు నోడల్ ఆఫీసర్, తహసీల్దార్‌తో కలసి రాయలసీమ యూనివర్సిటీలో కౌంటింగ్, స్ట్రాంగ్ రూమ్‌లను ఏర్పాటు చేసే భవనాలను పరిశీలించాలన్నారు. చివర్లో తాను, ఎస్పీతో కలసి తుది నిర్ణయం తీసుకుంటామన్నారు. 8 నియోజకవర్గాలకు అసెంబ్లీ, పార్లమెంట్ కౌంటింగ్ కేంద్రాలను వేర్వేరుగా ఏర్పాటు చేయాలని, ఒక్కో నియోజకవర్గానికి 4 రూమ్‌లను ఏర్పాటు చేసే దిశగా చర్యలు తీసుకోవాలన్నారు. నియోజకవర్గానికి అదనంగా రెండు రూమ్‌లు ఉండేలా చూడాలన్నారు. ఎలక్షన్ అబ్జర్వర్లకు రెండు రూమ్‌లు, పార్లమెంట్‌కు సంబంధించి పోస్టల్ బ్యాలెట్ ఓట్ల కౌంటింగ్‌కు ఒక రూమ్ ఉండేలా చూసుకోవాలన్నారు. స్వీప్, పోస్టల్ బ్యాలెట్ అధికారులు వారికి కేటాయించిన విధులను ప్రారంభించాలన్నారు. శుక్ర లేదా శనివారాల్లో నోడల్ అధికారులతో సమావేశాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. టెలీ కాన్ఫరెన్స్‌లో మునిసిపల్ కమిషనర్ భార్గవ్‌తేజ, ఆదోని సబ్ కలెక్టర్ శివనారాయణ శర్మ, పత్తికొండ, కర్నూలు ఆర్‌డీఓలు రామలక్ష్మి, హరిప్రసాదు, జెడ్పీ సీఈఓ నాసరరెడ్డి పాల్గొన్నారు.

సమస్యలపై స్పందించండి

- ఎస్ఈ ఎం.ఉమాపతి



కర్నూలు(రాజ్‌విహార్): విద్యుత్ సరఫరాలో ఏర్పడే అంతరాయ సమస్యలపై స్పందించాలని దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ కర్నూలు ఆపరేషన్స్ ఎస్ఈ ఎం.ఉమాపతి ఆదేశించారు. సోమవారం ఆయన కింది స్థాయి అధికారులతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. వివిధ కారణాలతో బ్రేక్ డౌన్, ఫీడర్ డౌన్, ట్రిప్పింగ్స్, ఫ్యూజ్ ఆఫ్ కాల్, ఎగ్జిఫ్యూజ్, ట్రాన్స్‌ఫార్మర్ వద్ద ఫ్యూజ్ కాలిపోవడం వంటి కారణాలతో అంతరాయం ఏర్పడుతూ ఉంటుందని, ఈ సమస్యల వల్ల కరెంట్ పోయిందని వినియోగదారుల నుంచి ఫిర్యాదులు వస్తే వెంటనే స్పందించి పరిష్కరించాలని సూచించారు.



ఆరోగ్యశ్రీ లేకపోతే ప్రాణం పోయేది

నాకు ముప్పావు ఎకరా బీడు భూమి ఉంది. వ్యవసాయ కూలీగా జీవనం సాగిస్తున్నా. నాతో పాటు నా భార్య గోవిందమ్మ, నలుగురు కూతుళ్లు, ఒక కుమారుడు కూడా వ్యవసాయ కూలీలుగా మారాం. కష్టపడి ముగ్గురు కూతుళ్లు, కుమారునికి పెళ్లి చేశాను. ఒక కుమార్తెకు పెళ్లి చేయాల్సి ఉంది. కుటుంబాన్ని నెట్టుకొచ్చేందుకు కూలి పనులు చేస్తున్న క్రమంలో గత నెల 26వ తేదీన నాకు గుండెపోటు వచ్చింది. కుటుంబసభ్యులు ఆదోనిలోని ప్రైవేటు ఆసుపత్రికి తీసుకెళ్లారు. అక్కడ ప్రాథమిక చికిత్స అనంతరం కర్నూలులోని మెడికవర్ హాస్పిటల్‌కు రెఫర్ చేశారు. అన్ని రకాల పరీక్షలు నిర్వహించిన అనంతరం నాకు మూడు రక్తనాళాలు బ్లాక్ అయ్యాయని, బైపాస్ సర్జరీ చేయాలని వైద్యులు తేల్చారు. పక్షం రోజుల తర్వాత నాకు వైద్యులు బైపాస్ సర్జరీ చేశారు. ఈ ఆపరేషన్‌ను పూర్తిగా ఉచితంగా ఆరోగ్యశ్రీ పథకం ద్వారా చేశారు. రానుపోను ఛార్జీలు కూడా ఇచ్చారు. డిశ్చార్జ్ అయిన మూడు రోజులకే ఆసరా కింద రూ.9,500లను సైతం నా బ్యాంకు ఖాతాలో వేశారు. ఈ ఆపరేషన్‌కు రూ.5లక్షలకు పైగానే ఖర్చు అవుతుందని వైద్యులు చెప్పారు. అంత డబ్బు నావద్ద లేదు. ముప్పావు ఎకరాకు అప్పు కూడా పుట్టే పరిస్థితి లేదు. ఆరోగ్యశ్రీ పథకం లేకపోతే గుండెపోటుతో నేను ప్రాణాలు వదలాల్సి వచ్చేది.

–ఉప్పర గోవిందు, నజ్జలగూడెం, కోసిగి మండలం



కులవృత్తులకు అండగా ప్రభుత్వం

కుల వృత్తులకు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం అండగా నిలుస్తోంది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కులవృత్తులు చేస్తున్న వారి కోసం జగనన్న చేదోడు పథకం ప్రవేశపెట్టి ఏడాది రూ. 10వేలు ఆర్థిక సాయం చేస్తున్నారు. నాకు ఇప్పటి వరకు నాలుగు సార్లు రూ.10వేలు చొప్పున రూ. 40వేలు వచ్చాయి. రజక వృత్తిని నమ్ముకుని జీవనం సాగిస్తున నేను రెండు ఇస్త్రీ పెట్టెలు కొనుకున్నాను. నాకు ఒక కుమారుడు, ఇద్దరు కూతుర్లు ఉన్నారు. దివ్యాంగుల పింఛన్ వస్తోంది.

–చాకలి నాగరాజు, చెట్లమల్లాపురం, కల్లూరు




బిషప్ చర్చిలో ప్రార్థనలు చేస్తున్న బిషప్ చౌరప్ప


ప్రత్యేక పార్థనల్లో పాల్గొన్న బ్రాహ్మణకొట్కూర్ గ్రామస్తులు


దోన్ బైబిల్ మిషన్ చర్చిలో చీరెలు పంపిణీ చేస్తున్న రెవ.బందెల రాజు


మద్దికెరలో పూలతో బాలయేసును అలంకరించిన దృశ్యం


దొర్నిపాడు మండలం క్రిష్టిపాడులో చిన్నారులకు క్రిస్మస్ కానుకలను అందజేస్తున్న యువకులు


కర్నూలు: సీక్యాంపు ప్రార్థన మందిరంలో ప్రేయర్ చేస్తున్న రెవరెండ్ గంట కరుణ సాగర్


కర్నూలు: క్రైస్తవులను ఆశీర్వదిస్తున్న రెవరెండ్ డాక్టర్ వరప్రసాదు


ప్రభువా: ప్రార్థన చేస్తున్న యువతి


సీఎస్ఐ చర్చిలో పండుగ వాతావరణం

శాంతి.. కరుణ.. ప్రేమ

హ్యాపీ హ్యాపీ క్రిస్మస్.. మెర్రీ మెర్రీ క్రిస్మస్ అంటూ ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా క్రైస్తవులు సంబరాలు చేసుకున్నారు. బాల ఏసు రాకను స్వాగతిస్తూ ఆదివారం అర్ధరాత్రి నుంచే క్రిస్మస్ వేడుకలు ప్రారంభయ్యాయి. కేకులు కట్ చేసి శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఊరూరా బాల ఏసు ప్రతిమను ఊరేగిస్తూ గేయాలు ఆలపించారు. సోమవారం ఉదయాన్నే చర్చీలకు చేరుకుని ప్రత్యేక ప్రార్థనలు చేపట్టారు. పాస్టర్లు వ్యాఖ్యోపదేశం చేశారు. పాపుల రక్షణకు ఏసు భూలోకానికి వచ్చారని, ప్రతి ఒక్కరూ ఏసు చూసిన శాంతి మార్గంలో నడుస్తూ కరుణ చూపుతూ సహోదర ప్రేమను కురిపించాలని సూచించారు. గ్రామాల్లో ఆటల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు పంపిణీ చేశారు.

– సాక్షి, నెట్‌వర్క్


కర్నూలు: బిషప్ చర్చిలో ఏసు జనన వృత్తాంతం


నందికొట్కూర్: సీఎస్ఐ టౌన్ చర్చి చుట్టూ సిలువతో తిరుగుతున్న క్రైస్తవ భక్తులు


ఉయ్యాలవాడ హోసన్న మందిరంలో నృత్యం చేస్తున్న చిన్నారులు


కర్నూలు: కోల్స్ చర్చిలో ప్రార్థన చేయిస్తున్న రెవరెండ్ జీవన్‌రావు


వెల్దుర్తి హోసన్న మందిరంలో ప్రబోధిస్తున్న రెవరెండ్ ఇసాక్


కర్నూలు: బైబిల్ చదువుతున్న మహిళలు


హాజరైన క్రైస్తవులు


ప్రార్థనలకు హాజరైన క్రైస్తవులు


వెల్దుర్తి ఏబీఎం మెయిన్ చర్చిలో పాల్గొన్న క్రైస్తవులు

సివిల్ ఇంజినీరు ఆత్మహత్య

కర్నూలు(అర్బన్): నగర శివారులోని కర్నూలు–దూపాడు రైల్వే స్టేషన్ల మధ్య రైలు పట్టాలపై సివిల్ ఇంజినీరు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. రైల్వే పోలీసులు తెలిపిన వివరాలు.. డోన్ పట్టణం తారకరామానగర్‌కు చెందిన కొమ్ము మనోహర్ (27) కర్నూలు – గుంటూరు జాతీయ రహదారి పనులకు సంబంధించిన సంస్థలో సివిల్ ఇంజినీరుగా పని చేస్తున్నాడు. ఈక్రమంలో సోమవారం రైలు పట్టాలపై మృతదేహం రెండు భాగాలుగా పడి ఉండటాన్ని రైల్వే గ్యాంగ్‌మెన్ వెంకటేశ్వర్లు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. అక్కడి పరిస్థితులను పరిశీలించి ఆత్మహత్యగా కేసు నమోదు చేసుకున్నామని, ఆత్మహత్యకు కారణాలు విచారణలో తెలియాల్సి ఉందని రైల్వే పోలీస్ స్టేషన్ ఎస్‌హెచ్‌ఓ కోదండ రాముడు తెలిపారు. మృతుడికి భార్య సునీత, ఇద్దరు పిల్లలు ఉన్నారు.


విద్యార్థి అదృశ్యం


హేమంత్ (ఫైల్)

ఓర్వకల్లు: చదువుపై ఇష్టం లేక ఓ విద్యార్థి ఇంటి నుంచి వెళ్లిపాయాడు. ఎస్ఐ రాజారెడ్డి తెలిపిన వివరాలు.. మండలంలోని కొమరోలు గ్రామానికి చెందిన బోయ శివ, మహేశ్వరి దంపతుల కుమారుడు హేమంత్ (14) మీదివేముల జెడ్పీ హైస్కూల్‌లో 9వ తరగతి చదువుతున్నాడు. చదువుపై ఇష్టం లేదని, ఏదైనా పని చేసుకుంటానని తల్లిదండ్రులతో చెప్పేవాడు. ఇదే విషయమై ఇటీవల మందలించారు. దీంతో మనస్థాపానికి గురై ఈనెల 20న ఇంటి నుంచి వెళ్లిపోయాడు. తిరిగి రాకపోవడంతో తల్లిదండ్రులు సోమవారం పోలీసులను ఆశ్రయించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్ఐ తెలిపారు.

పారిన ముందస్తు ప్రణాళిక

- ఎల్ఎల్‌సీ నీటితో వెసులుబాటు
- రెండు నెలల కిందటే ఎస్ఎస్ ట్యాంకులు నింపుకునేందుకు చర్యలు
- 5.9 టీఎంసీల వాటా నీటితో నిండిన జలాశయాలు
- 17 ఎస్ఎస్ ట్యాంకుల్లో సమృద్ధిగా నీరు
- తొలగిన 372 జనావాసాల నీటి కష్టాలు


నిండుకుండలా హెబ్బటం ఎస్ఎస్ ట్యాంకు

కర్నూలు(అర్బన్): అధికార యంత్రాంగం ముందస్తు చర్యలతో జిల్లాలోని 372 జనావాసాల నీటి కష్టాలు తప్పాయి. తాగునీటికి ప్రధాన వనరు తుంగభద్ర దిగువ కాలువ నీటిని సకాలంలో వినియోగించుకోవడం వల్ల మరో రెండు నెలల వరకు తాగునీటికి ఢోకా లేదు. నవంబర్ నెలాఖరు నాటికి తుంగభద్ర దిగువ కాలువకు నీటి సరఫరా బంద్ కానుందని, ఈలోపు దిగువ కాలువ నీటిపై ఆధారపడిన ఎస్ఎస్ ట్యాంకులన్ని నింపుకోవాలని జలవనరుల శాఖ ఇంజినీర్లు అక్టోబర్‌లో సూచించారు. డిసెంబర్‌తో పాటు 2024 జనవరి, ఫిబ్రవరి నెలలను దృష్టిలో ఉంచుకొని ఆయా ఎస్ఎస్ ట్యాంకులను నింపుకునేందుకు ఆర్‌డబ్ల్యూఎస్ ఇంజినీర్లు చర్యలు చేపట్టారు. పశ్చిమ ప్రాంతాలు ఆదోని, ఆలూరు, ఎమ్మిగనూరు, మంత్రాలయం, పత్తికొండ నియోజకవర్గాల్లోని అనేక గ్రామాల్లోని 4,87,932 జనాభాకు తుంగభద్ర దిగువ కాలువ నీరే ఆధారం. ఈ ఏడాది ఆశించిన స్థాయిలో వర్షాలు లేకపోవడం వల్ల ఆయా ప్రాంతాల ప్రజలకు నీటిని సరఫరా చేసే జలాశయాల్లో నీరు సగానికి తగ్గిపోవడంతో భవిష్యత్తులో ఇబ్బందులు పడాల్సి వస్తుందని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు కొంత ఆందోళనకు గురయ్యారు.

ఎల్ఎల్‌సీ నీటితో వెసులుబాటు

ఎల్ఎల్‌సీ నీటిని నిల్వ చేసుకునేందుకు వెసులుబాటు లభించడంతో ఆయా ప్రాంతాల్లోని సమ్మర్ స్టోరేజ్ ట్యాంకులను తుంగభద్ర దిగువ కాలువ నీటితో నింపి దాదాపు 372 గ్రామాల ప్రజల తాగునీటి అవసరాలకు వినియోగించుకుంటున్నారు. టీబీ డ్యాం నుంచి జిల్లాకు (ఎల్ఎల్‌సీకి) 11.9 టీఎంసీలు కేటాయింపులు కాగా, ఇప్పటి వరకు 6 టీఎంసీలకు ఉపయోగించుకోగా, ఇంకా 5.9 టీఎంసీల నీటిని వినియోగించుకోవాల్సి ఉన్నట్లు జల వనరుల శాఖ అధికారులు తెలిపారు. తుంగభద్ర దిగువ కాలువ పరిధిలోని ఎస్ఎస్ ట్యాంకులతో పాటు కేసీ కెనాల్ పరిధిలోని గార్గేయపురం, గాజులదిన్నె ప్రాజెక్టు పరిధిలోని పత్తికొండ స్కీం నుంచి ఆయా గ్రామాల ప్రజల దాహార్తిని తీర్చేందుకు ఆయా జలశయాల్లో ఎల్ఎల్‌సీ, హెచ్ఎన్ఎస్ఎస్ నీటిని నిల్వ చేశారు. ఎల్ఎల్‌సీ, కేసీ, జీడీపీ కెనాల్స్ నుంచి ఎస్ఎస్ ట్యాంకులకు రెగ్యులర్‌గా నీటిని పంప్ చేస్తూనే ఆయా గ్రామాల ప్రజల అవసరాలకు నీటిని విడుదల చేస్తూ వచ్చారు. దీంతో జిల్లాలోని అన్ని జలాశయాలు నేడు 90 నుంచి 100 శాతం నీటితో కళకళలాడుతున్నాయి.

జిల్లాలో ఎస్ఎస్ ట్యాంకుల్లో నీటి నిల్వలు

మొత్తం 17 జలాశయాలకు సంబంధించి ఇప్పటి వరకు పెసలబండ, మండగిరి, హెబ్బటం, హానవాలు, కుప్పగల్, కౌతాళం, గోనెగండ్ల, ఎల్లార్తి, బాపురం, చింతకుంట, విరుపాపురం సమగ్ర రక్షిత మంచినీటి పథకాల్లో వంద శాతం నీరు పుష్కలంగా ఉంది. మిగిలిన వాటిలో 70 నుంచి 90 శాతం నీరు నిల్వ ఉంది.

జనవరిలో కూడా ఎల్ఎల్‌సీకి నీరు వచ్చే అవకాశం



తుంగభద్ర దిగువ కాలువకు జనవరి నెలలో కూడా మరోసారి నీటిని వదిలే అవకాశాలున్నాయి. ప్రస్తుతం ఎల్ఎల్‌సీకి నీరు బంద్ అయినా ఎలాంటి ఇబ్బంది లేకుండా దిగువ కాలువ పరిధిలోని ఎస్ఎస్ ట్యాంకుల్లో అవసరాల మేర నీటిని నిల్వ చేశాం. అధిక భాగం ఎస్ఎస్ ట్యాంకులన్ని ఎల్ఎల్‌సీ పరిధిలోనే ఉన్నాయి. ఆయా జలాశయాలతో పాటు హెచ్ఎన్ఎస్ఎస్ నీటితో గార్గేయపురం జలాశయాన్ని కూడా నింపుతున్నాం. ఇప్పటి వరకు 70 శాతం నీరు నిల్వ ఉంది. ఇంకా ఫిల్ చేసే ప్రక్రియ కొనసాగుతోంది. జనవరిలో ఎల్ఎల్‌సీకి నీటిని విడుదల చేస్తే రానున్న వేసవిలో ఎలాంటి నీటి ఇబ్బందులు ఉండవు.

– బీ నాగేశ్వరరావు, ఎస్ఈ, ఆర్‌డబ్ల్యూఎస్

చదువుతోనే జాతి అభివృద్ధి సాధ్యం


క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న బలిజ, కాపు సంఘం నేతలు

కర్నూలు(అర్బన్): చదువుతోనే జాతి అభివృద్ధి సాధ్యమని, బలిజలు తమ పిల్లలను బాగా చదివించి వారికి నచ్చిన రంగంలో రాణించేలా ప్రోత్సహించాలని అహోబిలం నిత్యాన్నదాన సత్రం అధ్యక్షులు శెట్టి విజయకుమార్ సూచించారు. సోమవారం స్థానిక బిర్లా కాంపౌండ్‌లోని కార్యాలయంలో దివంగత మిరియాల వెంకటరావు జయంతి, వంగవీటి మోహనరంగా వర్ధంతిల సందర్భంగా బలిజ, కాపు సంఘీయుల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. కాపు సంక్షేమ సేన జిల్లా అధ్యక్షులు కోనేటి వెంకటేశ్వర్లు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో విజయకుమార్ మాట్లాడుతూ దివంగత బలిజ, కాపు నేతల స్ఫూర్తితో బలిజ యువత రాజకీయాల్లోకి రావాలన్నారు. రోపా ఆధ్వర్యంలో ఏటా బలిజ పేద విద్యార్థులకు ఉపకార వేతనాలు అందించడం అభినందనీయమన్నారు. అన్ని రాజకీయ పార్టీలు ఉమ్మడి కర్నూలు జిల్లాలో బలిజల జనాభా దామాషా ప్రకారం చట్టసభలకు సీట్లు కేటాయించాలన్నారు. అనంతరం కాపు సంక్షేమ సేన ఉమ్మడి కర్నూలు జిల్లా 2024 సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో బలిజ సంఘం కర్నూలు, నంద్యాల జిల్లాల అధ్యక్షులు కోనేటి చంద్రబాబు, దంతెల రమణ, కాపునాడు రాష్ట్ర అధ్యక్షులు ఆర్జా రామక్రిష్ణ, రోపా అధ్యక్షులు కొట్టే చెన్నయ్య, మహిళా అధ్యక్షురాలు కప్పట్రాళ్ల హేమలత తదితరులు పాల్గొన్నారు.

శ్రీగిరిలో ట్రాఫిక్ నియంత్రణకు చర్యలు


దేవస్థానం టోల్ గేట్ సమీపంలో ట్రాఫిక్‌ను క్లియర్ చేస్తున్న ఆత్మకూరు డీఎస్పీ శ్రీనివాసరావు

శ్రీశైలం: శ్రీశైలంలో తరచూ ట్రాఫిక్ జామ్ ఏర్పడుతుండటంతో ఆత్మకూరు డీఎస్పీ శ్రీనివాసరావు నేరుగా రంగంలోకి దిగారు. సమస్యను తెలుసుకున్న ఆయన ఆదివారం అర్ధరాత్రి 1 గంటకు శ్రీశైలం చేరుకుని సిబ్బందితో కలిసి వాహనాల రాకపోకలను క్రమబద్ధీకరించారు. టోల్‌గేట్, నందిమండపం, ఔటర్‌రింగ్ రోడ్డు, సాక్షిగణపతి, హటకేశ్వరం తదితర తదితర ప్రదేశాల్లో ట్రాఫిక్‌కు అంతరాయం కలుగకుండా విడుతల వారీగా వాహనాలను శ్రీశైలానికి తిరిగి వెళ్లేలా చర్యలు చేపట్టారు.ఈ సందర్భంగా ఆయన 'సాక్షి'తో మాట్లాడుతూ రద్దీ సమయాల్లో స్థానిక పోలీసులతో పాటు దేవస్థానం సెక్యూరిటీ సిబ్బందికి అదనంగా మరో 50 మంది హోమ్‌గార్డులను దేవస్థానం వారు నియమించుకునేలా ఈఓకు సూచించామన్నారు. అలాగే అదనపు పార్కింగ్ ప్రదేశాలను ఏర్పాటు చేసి అక్కడ టాయిలెట్స్, మంచినీరు, విద్యుత్ సౌకర్యాలను కల్పించాలని ఈఓ, చైర్మన్‌కు రాతపూర్వకంగా ఆదేశాలు జారీ చేస్తామన్నారు.

హాస్టళ్లకు దుప్పట్లు మంజూరు


విద్యార్థులకు దుప్పట్లు అందిస్తున్న దృశ్యం

కర్నూలు(అర్బన్): వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో కొనసాగుతున్న వసతి గృహాల విద్యార్థులకు ప్రభుత్వం దుప్పట్లను సరఫరా చేసింది. సోమవారం సాయంత్రం వాటిని స్థానిక బీ క్యాంప్‌లోని బీసీ, డీఎన్‌టీ బాలుర వసతి గృహాల విద్యార్థులకు బీసీ సంక్షేమ, సాధికారత జిల్లా అధికారిణి పి.వెంకటలక్షుమ్మ అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాకు 5,200 దుప్ప ట్లు మంజూరయ్యాయని, వాటిని అన్ని వసతి గృహాలకు పంపే ఏర్పాట్లు చేశామన్నారు. కార్యక్రమంలో ట్రైనీ డీబీసీడబ్ల్యూఈఓ భరత్‌కుమార్‌రెడ్డి, సహా య బీసీ సంక్షేమశాఖ అధికారి లక్ష్మీనారాయణ, వసతి గృహ సంక్షేమాధికారిణి మహాలక్ష్మి పాల్గొన్నారు.

యువకుడి దుర్మరణం

- ఇద్దరికి గాయాలు


మృతిచెందిన అయ్యస్వామి

మిడుతూరు: వీపనగండ్ల బాట సమీపంలో ఎదురెదురుగా బైక్‌లు ఢీకొన్న ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందిన ఘటన సోమవారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. మిడుతూరుకు చెందిన లక్ష్మీకి బేతంచెర్ల మండలం ముద్దవరం గ్రామానికి చెందిన అయ్యస్వామి (25)తో మూడేళ్ల క్రితం వివాహమైంది. క్రిస్మస్ సందర్భంగా ముద్దవరం నుంచి దంపతులిద్దరూ మిడుతూరుకు చేరుకున్నారు. కాగా ఆదివారం ఉదయం వడ్డెమానులో ఉన్న బంధువుల ఇంటికి అయ్యస్వామి బైక్‌పై వెళ్తుండగా వీపనగండ్ల బాట సమీపంలో అలంపూరుకు చెందిన మహిధర్, కుమార్ మిడుతూరులో ఉన్న బంధువుల ఇంటికి బైక్‌పై వస్తూ ఎదురుగా ఢీకొన్నారు. ఈ ప్రమాదంలో అయ్యస్వామి అక్కడికక్కడే మృతి చెందాడు. గాయపడిన ఇద్దరిని 108లో చికిత్స నిమిత్తం కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న ఎస్ఐ జగన్ మోహన్ సంఘటన స్థలానికి చేరుకుని ప్రమాద వివరాలు తెలుసుకున్నారు. మృతుడికి భార్య లక్ష్మి, మూడు నెలల కుమారుడు ఉన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నందికొట్కూరు ఆసుపత్రికి తరలించారు. ఫిర్యాదు అందిన వెంటనే కేసు నమోదు చేయనున్నట్లు ఎస్ఐ తెలిపారు.


క్షతగాత్రులను 108లో తరలిస్తున్న దృశ్యం